ఆంధ్రజ్యోతి
andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 27.3, కనిష్ఠం 23.1
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
గురువారం 3 జూలై 2025



జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న పోచారం

పేదల తలరాతలను మార్చేది అక్షరమే

- విద్యాభివృద్ధికి ప్రతి యేటా రూ.20వేల కోట్ల ఖర్చు
- రాష్ట్ర వ్యవసాయ సలహదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి
- కోటగిరి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పనితీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన పోచారం

కోటగిరి, జూలై 2(ఆంధ్రజ్యోతి): నిరుపేదల తల రాతలను మార్చేది అక్షరం ఒక్కటేనని, చదువును నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని రాష్ట్ర వ్యవసాయ సలహదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. కళాశాల ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కళాశాల, జిల్లా పరిషత్ పాఠశాల పరిసరాలను పరిశీలించారు. జూనియర్ కళాశాలలో విద్యార్థుల హాజరుశాతం, గత ఏడాది ఫలితాల శాతం పరిశీలించి తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. కళాశాలలో 450పైగా విద్యార్థులు ఉన్నట్లు చెప్పి కేవలం 150మంది విద్యార్థులు మాత్రమే కళాశాలకు హాజరు కావడంతో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రిన్సిపాల్ మొదలుకుని అధ్యాపకుల వరకు అయారం, గాయారం అన్న చందంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రతి ఏటా విద్యారంగానికి 20వేల కోట్ల రూపాయలకు పైగా ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. ఆర్థిక స్థోమత లేని వారు చదువు మధ్యలో నిలిచిపోకుండా వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసేందుకు ప్రభుత్వం ఎంతగానో ఖర్చు చేస్తుందన్నారు. కళాశాల ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా విద్యార్థుల హజరుశాతం, గత ఏడాది ఫలితాల శాతం తక్కువగా ఉండడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫలితాల శాతం తక్కువగా ఉంటే అడ్మిషన్లు ఎలా వస్తాయని ఆయన ప్రశ్నించారు. బాన్సువాడ నియోజకవర్గాన్ని విద్యరంగంలో నెంబర్ వన్‌గా నిలిపేందుకు పాలిటెక్నిక్, నర్సింగ్, ఉర్దూ మహిళా డిగ్రీ కళాశాలతో పాటు మోడల్, గురుకుల, కస్తూర్బా పాఠశాలలను 31కిపైగా ఏర్పాటు చేశానన్నారు. నియోజకవర్గంలో తాను తీసుకువచ్చిన పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్లు దొరకని పరిస్థితి నెలకొందన్నారు. కోటగిరి జూనియర్ కళాశాల అందుకు భిన్నంగా ఉండడంపై ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ కళాశాలపై నమ్మకం పెరిగేలా విద్య బోధన చేయాలన్నారు. ప్రిన్సిపాల్ కైసర్ పాషా పనితీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుకు మించిన ఆస్తి మరొకటి లేదని విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రతి విద్యార్థికి ఇంటర్ విద్యా ఎంతో కీలకమైందని ఇప్పటి నుంచే భవిష్యత్ లక్ష్యాన్ని

మిగతా 8వ పేజీలో...



పెచ్చులూడుతున్న భవనం పైకప్పు





శిథిలావస్థలో నాందేవ్‌వాడ బీసీ బాలుర కళాశాల వసతిగృహం

వసతి గృహాలకు మరమ్మతులు కరువాయే!

- జిల్లాలోని హాస్టళ్ల మైనర్ రిపేర్లకు బడ్జెట్ లేదు
- అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టళ్లలో వసతుల కరువు
- ఇబ్బందులు పడుతున్న వసతి గృహాల విద్యార్థులు
- 24 నెలలుగా అందని అద్దె.. 7 నెలలుగా నిలిచిన డైట్ బడ్జెట్

నిజామాబాద్ అర్బన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): విద్యాసంవత్సరం ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా ప్రభుత్వ వసతి గృహాల మరమ్మతులను పట్టించుకునే వారు కరువయ్యారు. నిరుపేద విద్యార్థులకు వసతిని ఇచ్చే వసతి గృహాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నా ప్రభుత్వం మాత్రం వాటివైపు కన్నెత్తి చూడటం లేదు. వేసవి సెలవుల్లోనే చిన్న చిన్న రిపేర్లను పూర్తి చేసి వసతి గృహాలను విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి సిద్ధం చేయాల్సి ఉండగా ఎక్కడ కూడా వసతి గృహాలలో మరమ్మతులు చేసిన పాపాన పోలేదు. జిల్లా వ్యాప్తంగా ఏళ్ల క్రితం నిర్మించిన వసతిగృహాలన్నీ ప్రస్తుతం శిథిలావస్థలో ఉండగా.. వర్షాకాలంలో అందులో వసతి పొందాలంటే విద్యార్థులు భయం భయంగా గడపాల్సిన పరిస్థితి నెలకొంది. అద్దె భవనాల్లో కొనసాగుతున్న వసతిగృహాలైతే మరింత దారుణంగా ఉన్నాయి. కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడే పరిస్థితులు ఉన్నాయి. చాలీచాలని వసతులతో అద్దె భవనాల్లో కొనసాగుతున్న వసతి గృహాలలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత 24 నెలలుగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న వసతి గృహాలకు అద్దె రాకపోవడంతో వాటి భవన యజమానులు రిపేర్లు చేయించేందుకు వెనకాడుతుండటంతో సమస్యలు అలాగే ఉంటున్నాయి. గత ఏడు నెలలుగా సంక్షేమ వసతి గృహాలకు సంబంధించిన డైట్ బడ్జెట్ రాకపోవడంతో వార్డెన్‌లు సైతం విద్యార్థులకు భోజనాలు పెట్టేందుకు ఇబ్బందులు పడే పరిస్థితులు ఉన్నాయి. ఇప్పుడిప్పుడే విద్యాసంవత్సరం ప్రారంభమవుతుండగా ఇప్పటికైనా అధికారులు వసతిగృహాలను మెరుగుపర్చాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

వసతి గృహాలల్లో 10వేల మంది విద్యార్థులు..

జిల్లా వ్యాప్తంగా వివిధ వసతి గృహాలల్లో గత విద్యాసంవత్సరంలో 10వేల మంది విద్యార్థులకు పైగా వసతి పొందారు. జిల్లా వ్యాప్తంగా 33 బీసీ సంక్షేమ వసతి గృహాలు ఉండగా అందులో సుమారుగా 4వేల మంది విద్యార్థులు ఉంటున్నారు. 42 ఎస్సీ సంక్షేమ వసతి గృహాలు ఉండగా వాటిలోను 4వేల మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. 8 గిరిజన వసతి గృహాలలో 1500 మంది విద్యార్థులు ఉంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 10వేలకు పైగా పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థులు వసతి గృహాల్లో వసతి పొందుతున్నారు. మారుమూల గ్రామాల నుంచి జిల్లా కేంద్రానికి, మండల కేంద్రాలకు చదువుకునేందుకు వచ్చి అక్కడే వసతిగృహాల్లో వసతి పొందుతూ విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా వసతి గృహాల్లో మాత్రం అర కొర వసతులు ఉంటున్నాయి. వసతి గృహాల్లో సరైన వసతులు లేక చాలా మంది విద్యార్థులు వాటిలో ఉండేందుకు భయపడుతున్నారు. సంక్షేమ వసతి గృహాల మరమ్మతులకు అరకొర నిధులే విడుదల అవుతుండటంతో ఏళ్ల తరబడి పాత భవనాల్లోనే వసతి గృహాలను కొనసాగిస్తున్నారు. అద్దె భవనాలకు అద్దె సక్రమంగా చెల్లించకపోవడంతో వాటిలోనే సమస్యలు అధికంగా ఉంటున్నాయి. చిన్న రిపేర్లు సైతం భవనాల యజమానులే చేయాల్సి ఉండటంతో వారు కూడా అద్దె రాకపోవడంతో పనులను చేయడం లేదు.

21 వసతి గృహాలు అద్దె భవనాల్లోనే..

జిల్లా వ్యాప్తంగా 84 వివిధ సంక్షేమ వసతి గృహాలు ఉండగా 63 వసతి గృహాలు సొంత భవనాల్లో కొనసాగుతుండగా 21 వసతి గృహాలు మాత్రం అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 42 ఎస్సీ వసతిగృహాలు ఉండగా అందులో 9 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. 34 బీసీ వసతిగృహాలు ఉండగా 12 అద్దె భవనాల్లో, గిరిజన సంక్షేమ వసతిగృహాలు జిల్లా వ్యాప్తంగా 10 ఉండగా 2 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అద్దెభవనాలకు 24 నెలలు గా అద్దె చెల్లించకపోవడంతో వసతిగృహాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. అద్దె రాక, చేసిన రిపేర్లకు బిల్లులు రాక అద్దె భవనాల యజమానులు వసతి గృహాలను ఖాళీ చేయిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని దుబ్బలో ఇదివరకు ఉన్న బీసీ బాలికల వసతిగృహాన్ని అద్దె సక్రమంగా చెల్లించకపోవడంతో దానిని ఓ ప్రైవేటు పాఠశాలలోని భవనంలోకి మార్చారు. కింది అంతస్తు ప్రైవేటు పాఠశాల ఉండగా, పై రెండు అంతస్తుల్లో వసతిగృహాన్ని నిర్వహిస్తున్నారు. ఇలా జిల్లాలో అనేక చోట్ల అద్దె భవనాల్లో కొనసాగుతున్న వసతిగృహాలు సక్రమంగా లేవు. బాత్ రూమ్‌లు, డైనింగ్ హాల్ సక్రమంగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని కోటగల్లి బాలికల వసతి గృహంలో సెప్టిక్ ట్యాంక్ చెడిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.



రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

- రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, చిత్రంలో సీపీ

నిజామాబాద్ అర్బన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి, పోలీసు కమిషనర్ సాయి చైతన్య సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన రోడ్డు భద్రత జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. పోలీసు, రవాణా, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసీ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొని రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలనే విషయంపై చర్చించారు. జిల్లా మీదుగా ప్రధాన ఎన్‌హెచ్ 44, ఎన్‌హెచ్ 63 జాతీయ రహదారులు వెళ్తుండటం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాటికి ఆస్కారం లేకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాలను ఇప్పటికే బ్లాక్ స్పాట్‌లుగా పరిగణిస్తూ చేపట్టాల్సిన చర్యలపై ఇదివరకు జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు అమలయ్యేలా చూడాలన్నారు. ప్రమాదాలకు దారి తీస్తున్న కారణాలను గుర్తించి వాటికి పరిష్కారం, ప్రత్యమ్నాయాలు అమలు చేస్తే చాలా వరకు ప్రమాదాలకు అడ్డుకట్ట పడుతుందన్నారు. ఆ దిశగా పోలీసు, ఆర్ అండ్‌బీ, రవాణా శాఖ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇప్పటికే కొన్ని బ్లాక్ స్పాట్‌ల వద్ద చర్యలు చేపట్టిన ఫలితంగా 2023 సంవత్సరం నుంచి పోలిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుతూ వస్తున్నాయని అన్నారు. అయితే మరింత మెరుగైన చర్యలు తీసుకోవాలని తద్వారా విలువైన నిండు ప్రాణాలను కాపాడినట్లు అవుతుందన్నారు. మూలమలుపులు, కల్వర్టులు, ఎత్తు పల్లాలు, రోడ్డు నిర్మాణం సరిగ్గా లేకపోవడం వంటి వాటిని సరిచేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలలో వాహనదారులను

మిగతా 8వ పేజీలో...

జోరు వానల జాడేదీ?



- వానాకాలం మొదలై నెలరోజులు గడిచినా ఇప్పటికీ జిల్లాలో భారీ వర్షాలు లేవు
- వానల కోసం రైతుల ఎదురుచూపులు

నిజామాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో వర్షాకాలం మొదలై నెలరోజులు దాటినా ఇప్పటికీ భారీ వర్షాలు లేవు. చెరువుల్లోకి వరద చేరలేదు. ప్రాజెక్టుల్లోకి నీళ్లు రాలేవు. జిల్లాలోని ఆరు మండలాల పరిధిలో సగటు వర్షపాతం నమోదు కాలేదు. రైతులు పంటలు సాగు చేస్తున్నా వర్షాలు మాత్రం అనుకున్న విధంగా పడలేదు. గత సంవత్సరంతో పోలిస్తే వర్షాలు తక్కువ పడినా రైతులు మాత్రం వరితో పాటు ఇతర పంటలను సాగు చేస్తున్నారు. జిల్లాలో ప్రతియేడు జూన్ నెలలోనే కొంతమేర చెరువుల్లో జలమట్టాలు పెరిగిన ఈ సంవత్సరం మాత్రం ఆ పరిస్థితులు వచ్చే వర్షాలపై దృష్టి పెట్టిన రైతులు మాత్రం పెద్ద ఎత్తున పంటలు సాగు చేస్తున్నారు.

ఇప్పటి వరకు 154.6 మి.మీ వర్షం

జిల్లాలో జూన్ నుంచి ఇప్పటి వరకు 154.6 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 158.6 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలో సగటు వర్షపాతం నమోదైనా నందిపేట, వేల్పూర్, మెండోరా, ముప్కాల్, ఏర్గట్ల, నిజామాబాద్ రూరల్ మండలాల పరిధిలో మాత్రం తక్కువ వర్షం పడింది. జిల్లాలో 11 మండలాల పరిధిలో సగటు వర్షపాతానికి మించి వర్షం పడింది. 16 మండలాల్లో సగటు వర్షం పడింది.

చెరువుల్లో చేరని నీరు

జిల్లాలో వర్షం భారీగా పడకపోవడం వల్ల ఇప్పటి వరకు చెరువుల్లో నీళ్లు చేరలేదు. వాగులు పెద్దగా పారలేదు. వర్షాలు ఓ మోస్తరుగా ఉన్నా చెరువుల్లోకి మాత్రం వరద చేరడం లేదు. జిల్లా వ్యాప్తంగా చెరువులను పరిశీలిస్తే ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో చెరువుల్లోకి జలమట్టాలు చేరలేదు. జిల్లాలో మొత్తం 1086 చెరువులు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 2లక్షల ఎకరాల వరకు పంటలు సాగు అవుతున్నాయి. వానాకాలం మొదలై నెలరోజులు అవుతున్నా జిల్లాలోని ఏ చెరువుల్లో ఎక్కువగా

మిగతా 8వ పేజీలో...

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో పురోగతి సాధించాలి

- అధికారులు పనితీరును మెరుగుపర్చుకోవాలి
- వనమహోత్సవం కార్యక్రమం విజయవంతం చేయాలి
- వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- :అధికారుల సమీక్ష సమావేశంలో కలెక్టర్ టి. వినయ్‌కృష్ణారెడ్డి



ఆర్మూర్‌లో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ టి. వినయ్‌కృష్ణారెడ్డి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఆర్మూర్ రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను నెరవేర్చాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో పురోగతి సాధించాలని కలెక్టర్ టి. వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. ఆర్మూర్ పట్టణంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వన మహోత్సవం, ప్లాట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తులకు అనుమతి మంజూరు, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపడుతున్న చర్యలు తదితర అంశాలపై బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల వారీగా వివిధ అంశాలలో ప్రగతిని సమీక్షించిన కలెక్టర్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో ఆశించిన స్థాయిలో ప్రగతి లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. 617 మందికి ఇళ్లను మంజూరు చేయగా 183 మంది లబ్ధిదారులు మాత్రమే గ్రౌండింగ్ చేసుకున్నారని ఈ విషయంలో అధికారులు, వార్డు ఆఫీసర్‌లు పనితీరును మెరుగుపర్చుకోవాలన్నారు. పరిస్థితి ఇలానే ఉంటే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల లక్ష్యాలను ఎలా సాధిస్తారని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుల సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. ఇళ్లు మంజూరైన ప్రతీ ఒక్కరు నిర్మాణాలు చేపట్టేలా వారికి తోడ్పాటు అందించి ప్రోత్సహించాలన్నారు. ఆర్థిక స్థోమత లేని లబ్ధిదారులకు మెప్మా ఆధ్వర్యంలో రుణాలు ఇప్పించాలన్నారు. ఒక వేళ ఎవరైనా సంఘాలలో లేని పక్షంలో వారిని చేర్పించి రుణాలు ఇప్పించాలన్నారు. వచ్చేవారం మరోసారి సమీక్ష నిర్వహిస్తామని ఇళ్ల

మిగతా 8వ పేజీలో...



యూరియాను లారీలోలోడ్ చేస్తున్న దృశ్యం



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యూరియాను తీసుకెళ్తున్న రైతు

కేంద్రాలకు చేరిన యూరియా

- హర్షం వ్యక్తం చేసిన రైతులు

ఆర్మూర్ టౌన్, జూలై, 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంతో పాటు ఆర్మూర్‌లోని ఏఎంసీలోని వ్యవసాయ మార్కెట్ గిడ్డంగిలో నిల్వ ఉన్న యూరియా బస్తాలను 76 కేంద్రాలకు లారీల ద్వారా తరలించారు. ప్రతి రైతుకూ యూరియా అందేలా వ్యవసాయాధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 'జిల్లాలో యూరియా కొరత' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి వ్యవసాయ అధికారులు స్పందించారు. జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ)లతో పాటు కొనుగోలు కేంద్రాలకు లారీలలో యూరియాను పంపించారు. దీంతో స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలోని 210 యూరియా కొనుగోలు కేంద్రాలు ఉండగా అందులో 89 సొసైటీలు ఉన్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న పోలీసు కమిషనర్ సాయిచైతన్య



సమావేశానికి హాజరైన పోలీసు అధికారులు

కాలానికి అనుగుణంగా తమను తాము మెరుగుపర్చుకోవాలి

- జోన్-2 పోలీసు డ్యూటీమీట్‌లో పోలీసు కమిషనర్ సాయి చైతన్య

నిజామాబాద్ అర్బన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా చట్టాలను సైన్స్ ఇన్వెస్టిగేషన్ టూల్‌గా మార్చుకోవడం కోసం తమను తాము మెరుగుపర్చుకొని ఉత్తమ ప్రతిభ కనబర్చడం కోసం కన్విన్షన్ పెంచడం కోసం డ్యూటీమీట్‌లు ఉపయోగపడుతాయని పోలీసు కమిషనర్ సాయి చైతన్య అన్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జోన్-2 బాసర లెవల్ పోలీస్ డ్యూటీమీట్-2025 కార్యక్రమం (నిజామాబాద్, జగిత్యాల్, నిర్మల్, ఆదిలాబాద్) జిల్లాల పోలీసు డిపార్ట్‌మెంట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల తద్వారా పోలీసు విభాగంలో కానిస్టేబుల్ స్థాయి నుంచి సీఐ స్థాయి వరకు పోటీలలో పాల్గొననున్నారు. సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్, ఫొరెన్సిక్, ఫింగర్‌ప్రింట్ ఇన్వెస్టిగేషన్ కోసం ఎంపికలో భాగంగా నేరాలు జరిగినప్పుడు అట్టి నేరస్థలంలో సేకరించవల్సిన నేర సమాచారం కోసం పోలీసు క్లూస్ ఏ విధంగా సేకరించాలనే దానిపై ఎంపిక పరీక్షలు నిర్వహించారు. సీపీ సమక్షంలో సీఐలు, ఎస్సైలు, సిబ్బందికి ఎంపిక పరీక్షలు నిర్వహించారు. ఇందులో సైంటిఫిక్ ఎయిడ్స్ టూ ఇన్వెస్టిగేషన్, కంప్యూటర్, డాగ్‌స్క్వాడ్, ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫీ, ఎక్స్‌ప్లోజింగ్, నార్కోటిక్, ఫింగర్ ప్రింట్, ఫోరెన్సిక్ మెడిసిన్ తదితర అంశాల కోసం ఎంపికలు నిర్వహించారు. మూడు రోజుల పాటు ఈ ఎంపికలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఈ పోటీలలో మంచి ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయి డ్యూటీమీట్‌లో పంపడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అదనపు డీసీపీలు బస్వారెడ్డి, రాంచందర్‌రావు, సీసీఎస్ ఏసీపీ నాగేంద్రచారి, జగిత్యాల్, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్‌ల సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మానాల పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మానాల మోహన్‌రెడ్డి

ఏర్గట్ల, జులై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తడపాకల్ గ్రామానికి చెందిన జింక అనిల్ తండ్రి ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బుధవారం తెలంగాణ రాష్ట్ర కోఆపరేటి యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెం గంగా ప్రసాద్, మాజీ జడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్, తుపాకుల శ్రీనివాస్ గౌడ్, రవి రెడ్డి, రేండ్ల రమేష్, మునీర్, రొక్కెడ సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో ఘనంగా పీర్ల పండుగ


పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,జూలై2(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌తో పాటు పట్టణంలోని పలు వార్డులలో మండలంలోని పలు గ్రామాలలో మొహర్రం పండుగను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పీర్లను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. పీర్ల పండుగలో భాగంగా బుధవారం 5వ రోజు కావడంతో శక్కర్‌నగర్‌లోని పీర్లను ప్రధాన వీధుల గుండా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. డప్పువాయిద్యాల మధ్య పీర్ల పండుగను నిర్వహించారు. పీర్లపండుగ ఊరేగింపులో కుల, మతాలకు అతీతంగా ప్రజలు పాల్గొన్నారు.

7న ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించాలి


వేల్పూర్‌లో జెండా గద్దె నిర్మాణ స్థలం పరిశీలిస్తున్న మోచీ సంఘం సభ్యులు

వేల్పూర్, జూలై2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7న గ్రామ గ్రామగ్రామాన షెడ్యుల్ కులాల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ జరపాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు శివరాజు మాదిగ తెలిపారు. బుధవారం వేల్పూర్‌లో మోచీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జెండాగద్దె నిర్మాణానికి స్థలాన్ని పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ స్థాపించి 31 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా అలాగే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పుట్టిన రోజు సందర్భంగా జులై 7న జెండాను ప్రతీ గ్రామలో ఎగురవేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రశాంత్, సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా మోచీ సంక్షేమ కార్యదర్శి సుధాకర్, కేతన్, రాహుల్, వంశీ, ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్: ఈ నెల 7న ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సర్వగల్ల రవీందర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.రవీందర్ మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా పోరాటం చేసిన మన బిడ్డలకు దాని ప్రతిఫలాలు ఇప్పుడు అందాయని, అనేక అడ్డంకులు ఎదుర్కొన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాపయ్య, పండరి, హన్మండ్లు, రాములు, నిఖిల్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామానికి చేరిన గల్ఫ్ మృతదేహం


అన్వేష్ (ఫైల్)

కమ్మర్‌పల్లి, జూలై 2: (ఆంధ్రజ్యోతి) మండలంలోని హసాకొత్తూర్ గ్రా మానికి చెందిన జుబరాత్ అన్వేష్ (27) ఉపాధి నిమిత్తం నెలరోజులక్రితం ఓమన్ వెళ్లి గత 15 రోజులక్రితం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు ఈ విషయమై కంపెనీవారు పట్టించుకోకపోవడంతో మృతదేహం అక్కడి ఉండిపోయింది.ఈవిషయం కుటుంబసభ్యుల ద్వారా తెలుసుకున్న రాష్ట్రఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఈరవత్రి అనిల్ బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జి ముత్యాల సునీల్ కుమార్, గల్ఫ్ కన్వీనర్ భీమ్‌రెడ్డి స్పందిస్తూ ప్రత్యేక చర్యతీసుకుని ఇండియన్ ఎంబాసీతో సంప్రదించడంతో మృతదేహం బుదవారం ఉదయం హైదరాబాద్ విమానాశ్రయానికి చేరగా ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన అంబులెన్స్‌లో అన్వేష్ మృతదేహం సాయంత్రం స్వగ్రామం హసాకొత్తూర్ చేరింది. కుటుంబసభ్యులు అశ్రునయణాలతో అంత్యక్రిలు జరిపించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మృతునికి తల్లి, తండ్రి ఉన్నారు.

ఆలయాల్లో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

- నగలు, నగదు స్వాధీనం.. రిమాండ్‌కు తరలింపు


చోరీకి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న భీమ్‌గల్ సీఐ

కమ్మర్‌పల్లి, జూలై 2: (ఆంధ్రజ్యోతి) కమ్మర్‌పల్లి మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామాలలోని పలు ఆలయాల్లో చోరీకి పాల్పడిన వ్యక్తిని బుధవారం అరెస్టుచేసి ఆతనివద్ద నగలు, నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు భీమ్‌గల్ సీఐ పొన్నం సత్యనారాయణ, కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. ఇటీవల కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామశివారులోని ఎల్లమ్మఆలయంతో అదేగ్రామంలోని పెద్దమ్మ, పోచమ్మ ఆలయాల్లో, ఎర్గట్ల మండలం తొర్తి గ్రామంలోని శుక్రవారందేవి ఆలయం, కమ్మర్‌పల్లిలోని గుండ్లకుంట హనుమాన్ ఆలయాల్లో వరుస దొంగతనాలు జరుపగా ఆలయ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. కాగాబుధవారం మండలకేంద్రంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒకవ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా కరీంనగర్ జిల్లాకొత్తపల్లి మండలం రేగుర్తీ గ్రామానికి చెందిన తూర్పాటి కనకయ్యగా చెబుతూ.. ఆలయాల్లో చోరీకి పాల్పడింది తానేనని ఒప్పుకున్నాడని తెలిపారు.అతని వద్దనుంచి రూ.2వేల7వందల నగదుతో పాటు వెండి బంగారు ఆభరణాలు రికవరీచేసి ఆర్మూర్ కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈకేసు చేదించడంలో కృషిచేసిన ఐడి పార్టీ కానిస్టేబుల్ షౌకత్‌అలీ, నవీన్‌చంద్ర,వినయ్‌లను భీమ్‌గల్ సీఐ పొన్న సత్యనారాయణ అభినందించినట్లు తెలిపారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ


మోర్తాడ్‌లో విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేస్తున్న హెచ్‌ఎం


విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న ఎంఈవో నాగేశ్వర్‌రావు

భీమ్‌గల్,జూలై2 (ఆంధ్రజ్యోతి):పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూని యర్ కళాశాలలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేశారు.ఈకార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ఎన్ఎస్‌యూఐ వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ రహమాన్, ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి చేతుల మీదుగా పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యుఐ జిల్లావైస్ ప్రెసిడెంట్ రహమాన్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు ప్రణాళికతో చదివి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, విద్యను బోధించిన గురువులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు.ఈకార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు బాలమల్లు, అరుణ్, జాన్సన్, ఆనందం, ఎన్ఎస్‌యుఐ శ్రీకాంత్, అత్రిష్ యాదవ్, శివ, అంజి,నిఖిల్, సన్ని, సోను పాల్గొన్నారు.

రెంజల్: మండలంలోని నీలా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శ్రీమతి దేవత యమున గారి మిత్ర గ్రూప్ సభ్యులతో పాటు పతంజలి యోగా సెంటర్ వినాయక్ నగర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్‌లను ఎంఈవో కట్ట ఆంజనేయులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగం గౌడ్, కిషోర్, ప్రధానోపాధ్యాయులు శ్రీరాం, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, లింగన్న, రాజశ్రీ, సాయిబాబా, గ్రామ పెద్దలు సద్దాం, సుధాకర్ పాల్గొన్నారు.

మోర్తాడ్: మోర్తాడ్ మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో బుధవారం విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, వర్క్ బుక్కులను ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ పంపిణీ చేశారు. పాఠశాలకు చెందిన 76 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలరాజు, ప్రభాకర్,ఉపాధ్యాయులు రమణచారి,సాగర్, నర్సింహామూర్తి, సీఆర్‌పీలు సాయిరాం, సురేష్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి ఛైర్మన్ వరలక్ష్మీ పాల్గొన్నారు.

బాన్సువాడటౌన్:మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక , ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు 2025 - 26 విద్యాసంవత్సరానికి గాను బుధవారం మండల విద్యాధికారి నాగేశ్వరరావు అభ్యసన పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు , సిబ్బంది , సీఆర్‌పిలు , తదితరులున్నారు.

ఇస్సాపల్లిలో యూరియా కోసం రైతుల పడిగాపులు


ఇస్సాపల్లిలో యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు

ఆర్మూర్ రూరల్, జూలై2 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం ఆలూర్ సొసైటీ పరిధిలోని ఇస్సాపల్లిలో బుధవారం రైతులు యూరియా కోసం పడిగాపులు గాశారు. ఉదయం నుంచే రైతులు యూరియా కోసం క్యూ కట్టి చెప్పులు, రాళ్లు వరుసలో పెట్టుకున్నారు. గత కొన్ని రోజులుగా యూరియా లారీలు తక్కువగా రావడంతో కొరత ఏర్పడింది. వరినాట్లు వేసే సమయం కావడంతో యూరియాకు డిమాండ్ పెరిగింది. అంతేకాకుండా మొక్కజొన్న సైతం యూరియా వేయడానికి రైతులు సొసైటీ గోదాం ముందు ఎట్టకేలకు ఆలూర్ సొసైటీకి ఒక లారీ లోడు యూరియా రావడంతో ఒక్కొ రైతుకు నాలుగు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. గురువారం మరో రెండు లారీలు యూరియా రానుందని రైతులందరికి పంపిణీ చేస్తామని సొసైటీ ఛైర్మన్ తంబూరి శ్రీనివాస్ రైతులకు తెలిపారు.

ముప్కాల్:మండలంలోని రైతుల కు సొసైటీ ద్వారా ఎరువులను అందజేస్తామని ఏవో సాయి కృష్ణ తెలిపారు. ముప్కాల్ మండల కేంద్రంలోని ఎరువుల గోదాం వద్ద బుధవారం ఉదయం రైతులు యూరియాకోసం పడిగాపులుగాశారు. విషయం తెలుసుకున్న ఏవో సాయికృష్ణ అక్కడికి చేరుకొని గోదాంను తెరిపించి రైతు లకు యూరియా బస్తాలను పంపిణీ చేయించా రు. రైతులందరికి సరిపడా యూరి యా అందుతుందని ఈ విషయంలో ఆందోళన కు గురికావద్దని ఆయన కోరారు.రైతులందరికి యూరియా బస్తాలను పంపిణీచేశారు.అవరమైన మేరకే యూరియాను రైతులు వాడాలని ఏవో సూచిం చారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి


పడిగెల్ సమావేశంలో మాట్లాడుతున్న జీపీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

వేల్పూర్, జూలై2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని జీపీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసు కార్మికులకు పిలుపునిచ్చారు. మండలంలోని పడిగెల గ్రామంలో పంచాయితీ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం కోసం ఎనిమిది గంటల పని యదావిదంగా అమలు చేయాలని ఆయన కోరారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తు ఈనెల 9న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె చేపట్టడం జరుగుతుందన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ చట్టాలు కార్మికులకు వర్తింపజేయాలన్నారు. వేతన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. చెప్పులు, బట్టలు, నూనె, గ్లౌజులు ఇతర పరికరాలు ఇవ్వాలని ప్రతీ కార్మికుడి మీద ఇన్సురెన్సు కట్టాలని ఆయన ప్రభుత్వాని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదర్శ గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ మండల కమిటి అధ్యక్షుడు నరాటి లక్ష్మణ్, నాయకులు భూమన్న, రాజేశ్వర్, పోచన్న, నర్సయ్య, బాబురావు, వెంకవ్వ, బాగ్య, అనంత్, తదితరులున్నారు.

రుద్రూరు: కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని, జూలై 9న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికులు పాల్గొననున్నట్లు గ్రామ పంచాయతీ కార్మికులు బుధవారం రుద్రూరు ఎంపీడీవో భీమ్‌రావుకు సమ్మె నోటీస్ అందజేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లు తెచ్చి కార్మికులను కష్టాల పాలు చేస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు నన్నేసాబ్, యూనియన్ మండలాధ్యక్షుడు అశోక్, కార్మికులు సురేష్, సాయిలు, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంది

డొంకేశ్వర్, జూలై2 (ఆంధ్రజ్యోతి): మండలంలో సాగు చేస్తున్న పంటలకు సరిపోయే యూరియా అందుబాటులో ఉందని రైతుల ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డొంకేశ్వర్ మండల వ్యవసాయాధికారి మధుసుధన్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఎక్కడ కూడా యూరియా కొరత లేదని రైతులకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచామన్నారు. రైతులు ఆందోళన చెందకుండా అవసరం ఉన్న మేర యూరియాను తీసుకు వెళ్లాలని సూచించారు.

జాకోరాలో ఇద్దరికి ఇందిరమ్మ బిల్లు

వర్ని,జూలై 2(ఆంధ్రజ్యోతి): వర్ని మండలం జాకోరా గ్రామంలో బుధవారం ఇద్దరికి రూ.10 లక్షల ఇందిరమ్మ ఇల్లు బిల్లును అందజేయడం జరిగింది. బేగారి గంగామణి, అనిశవ్వలకు ఈబిల్లును అందజేశారు.త్వరలో ఇల్లునిర్మాణం పూర్తి చేసి అర్హత పొం దాలని అధికారులు సూచించారు. బిల్లు మంజూరు పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ ఎన్నిక

బోధన్‌రూరల్,జూలై2(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ ఎన్నికలో ఏకగ్రీవంగా జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన ప్రతాప్ గుప్తా, ప్రధాన కార్యదర్శి పూర్ణ ప్రసాద్, కోశాధికారి విజయ్ కుమార్ స్వామి ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో బోధన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్ బసవేశ్వర్ రావు, కొడాలి కిషోర్, శ్రీనివాస్ రావు, శ్రీధర్, రవీందర్ పాల్గొన్నారు.

గుర్తింపు ఉన్నచోటనే కళాశాలను నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలి

పెర్కిట్, జూలై2 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలంలోని చేపూర్ లో క్షత్రియ ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణలో గుర్తింపు పొందిన క్షత్రియ జూనియర్ కళాశాల పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీ పాత క్షత్రియ కళాశాల భవనంలో నిర్వహిస్తున్నారని సీవీఆర్ కళాశాల యాజమాన్యం గిరిరాజ్ డీఐఈవోకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కమ్మర్‌పల్లి,జూలై 2: (ఆంధ్రజ్యోతి) రోజు రోజుకు పెరిగి పోతున్న సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బుధవారం కమ్మర్‌పల్లి లో స్థానిక పోలీలు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరగాల్లు కొత్తకొత్త రకాలుగా మోసాలకు పాల్పడుతున్నారని, ముఖ్యంగా మహిళల ఫోటోలతో ఇట్టేఆకర్శిచేవిధంగా మోసాలకు పాల్పడుతు లక్షల్లో డబ్బులు దండుకుంటున్నారని ఇట్టి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. అలాంటి వెబ్‌సైట్లు, లింక్‌లు ఓపన్ చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మన్ పాలెపు నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

స్మైల్ ద స్కూల్‌కు మోస్ట్‌ఇన్నోవేటివ్ స్కూల్ అవార్డు

ఆర్మూర్ టౌన్, జూలై2 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన స్మైల్ ద స్కూల్ మోస్ట్ ఇన్నోవేటివ్ స్కూల్ అవార్డును అందుకున్నట్లు స్కూల్ డైరెక్టర్ రఫీక్ గోహర్ తెలిపారు. మంగళవారం బొంబాయిలోని నోవటేల్ హోటల్‌లో ఇంటర్ నేషనల్ గ్లోరీ అవార్డు 2025 స్టార్స్ ఆఫ్ ఇండియా, వికనెక్ట్ ఫ్లిమ్స్ అండ్ ఎంటర్నెంట్ మెంట్ వారు నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుండి పాల్గొనగా టాలీవుడ్, బాలీవుడ్ తమన్నా బాటియా చేతుల మీదుగా మోస్ట్ ఇన్నోవేట్ స్కూల్ అవార్డును అందుకు న్నామని స్కూల్ డైరెక్టర్ రఫీక్ గోహర్ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

ఆర్మూర్‌టౌన్, జూలై2 (ఆంధ్రజ్యోతి):ఇస్సాపల్లి గ్రా మా నికి చెందిన శెట్‌పల్లి ముత్తెన్న అనారోగ్యంతో భాదపడడంతో కాంగ్రెస్ ని యోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి ఎల్‌వోసీని అందజేశారు. ముత్తెన్న అనా రోగ్యంతో బాదపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నాడు.రూ.2లక్షల 50వేలు ఎల్‌వోసీ కాపీని కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ టెస్టులో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు


డొంకేశ్వర్‌లో కృష్ణసాయిగౌడ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

డొంకేశ్వర్, జూలై2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన పోస్టు గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్టులలో డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి గ్రామానికి చెందిన కృష్ణసాయి గౌడ్ రెండవ ర్యాంకు సాధించినందుకు గాను డొంకేశ్వర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థిగా కృష్ణసాయి గౌడ్ రాష్ట్రంలో పాఠశాల కీర్తిని రాష్ట్రవ్యాప్తంగా చాటినందుకు అభినందిస్తు ఆయనను పాఠశాల హెచ్‌ఎం సురేష్ కుమార్ సిబ్బందితో కలిసి సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే ఏదైనా సాధించ వచ్చని కృష్ణసాయిగౌడ్ నిరూపించారని ఆయనను ఆదర్శంగా తీసు కొని ప్రణాళిక బద్ధంగా కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగ వచ్చని తెలిపారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్‌కుమార్, గంగా రెడ్డి, వెంకటరమణ, అశోక్, సాయికుమార్, రాజేశ్వర్, సాగర్‌రవి, కిరణ్, సాయిలు, గంగాధర్,మంజులరాణి,అలివేణిమంగమ్మ, విజయలక్ష్మీ ,చంద్ర కళ, లావణ్య,సుమిత్ర పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వన మహోత్సవం

ఆర్మూర్‌రూరల్ , జూలై2 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని ప్రభు త్వ జూని యర్ కళాశాలలో బుధవారం వనమహోత్సవంలో భాగంగా అధ్యాపకులు మొక్కలు నాటారు. కళాశాల ఆవరణ, పరిసరా ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్ర మంలో అధ్యాపకులు చంద్రశేఖర్, నరేష్, విజయలక్ష్మీ, సుభాష్, గంగాదర్, చంద్ర మోహన్, నిఖిల్, లక్ష్మణ్, రామకృష్ణ పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్ దూరవిద్య ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కమ్మర్‌పల్లి,జూలై 2: (ఆంధ్రజ్యోతి) మధ్యలో బడి మానివేసిన విద్యారులు ఓపెన్ స్కూల్ ద్వార 2025-26 విద్యాసంవత్సరంలో పదవతరగతి, ఇంటర్‌మీడియట్ చదివేందుకునే ఆసక్తిగల వారు దరఖాస్తులు చేసుకోవాలని కమ్మర్‌పల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పసుపుల సాయన్న ఒక ప్రకటనలో తెలిపారు. దరకాస్తులు చేసుకోవడానికి ఈనెలాఖరువరకు అవకాశంఉందని తెలపారు. పదోతరగతి దరకాస్తుల కొరకు ఇదివరకు చదివిన పాఠశాలకు సంబంధించిన ఆవిద్యార్థియొక్క టీసీ, బోనాఫైడ్ లేదా తహసీల్దార్ ద్వారా జారీచేయబడిన బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం,రెండు పాస్‌పోట్ ఫోటోలు రెండుసెట్లుగా జిరాక్స్‌లు సమర్పించాలన్నారు.

- ఇంటర్ చదవాలనుకున్నవిద్యార్థులు

ఇంటర్‌మీడియట్ పరీక్షలు రాయలనుకున్న విద్యార్థులు టెన్త్ మెమో, టీసీ, కులధృవీకరణ పత్రం, అధార్‌కార్డు, రెండు పాస్‌పోట్ ఫోటోలు రెండు సెట్లుగా సమర్పించాలన్నారు. అదనపు సమాచారం కోసం 8790465456, 9515167500 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

బీర్కూర్‌లో క్లీన్ అండ్ గ్రీన్

బీర్కూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలో బుధవారం పలు కాలనీల్లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీడీవో మహబూబ్, పంచాయితీ కార్యదర్శి గంగారాంతో కలిసి పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. బీర్కూర్‌లో ఆయా కాలనీల్లో మురికి కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో దోమలు, ఈగల వృద్ధి చెందాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఇదిలా ఉండగా గ్రామ పంచాయితీ వారు పారిశుధ్య కార్మికులతో స్పెషల్ డ్రైవ్ చేపట్టి మురికి కాలువలను శుభ్రం చేయిస్తున్నారు. అలాగే తాగునీరు సరఫరా పైప్‌లు లీకేజీలు లేకుండా అరికట్టాలని సూచించారు.

పోరాడి సాధించుకున్న చట్టాలను రక్షించుకుందాం

- అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు కైరి దేవగంగు


మోర్తాడ్‌లో సమ్మె కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడి టీచర్లు

మోర్తాడ్, జూలై2 (ఆంధ్రజ్యోతి): కార్మికులు పోరాడి సాధించుకున్న తమ హక్కులను రక్షించుకుందామని అంగన్‌వాడి జిల్లా అధ్యక్షురాలు కైరి దేవగంగు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కార్యాలయంలో ఈనెల 9న జరిగే సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా దేవగంగు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్లు, ఆశవర్కర్లు, మధ్యాహ్న బోజన కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికులు, బీడీ కార్మికులు సమ్మెకు పిలుపు నిచ్చారని ఆమె అన్నారు. 9న జరిగే సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని దేవగంగు పిలుపునిచ్చారు. సమ్మెను విజయవంతం చేయడానికి మండల సమన్వయ కమిటిని ఏర్పాటు చేశామని కన్వీనర్‌గా జ్యోతి, కోకన్వీనర్‌గా శాంతి, సభ్యులుగా మాజీద్, శారద, హారిక, సుమలత, ప్రేమలత లను ఎన్నుకోవడం జరిగిందని దేవ గంగు తెలిపారు. సమావేశంలో అంగన్‌వాడి యూనియన్ నాయకులు జ్యోతి, చంద్రకళ, జమున, అనురాధ, మమత, సమత పాల్గొన్నారు.

ఆర్మూర్ డిపో నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు

పెర్కిట్,జూలై2 (ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ డిపో నుంచి పుణ్యక్షేత్రం అరుణాచలంకు ఈనెల 8వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు ప్రత్యేక బస్సు బయల్దేరునని డిపో మేనేజర్ రవికుమార్ తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు బయల్దేరి కాణిపాకం, వేలూర్‌లోని గోల్డెన్ టెంపుల్ దర్శనాలు చేసుకొని అరుణాచలానికి 10 తేదీన ఉదయం చేరుకొనెను. గిరిప్రదక్షణ, దర్శనం చేసుకొని తిరుగు ప్రయాణంలో జోగులాంబ శక్తి పీఠం దర్శనం చేసుకొని, 11వతేదీన రాత్రి పదిగంటలకు ఆర్మూర్ చేరుకుంటుందని తెలిపారు.ఈ యాత్రకు గాను పెద్దలకు ఐదువేల ఒక్కవంద, పిల్లలకు రెండువేల ఆరు వంద రూపాయలు చార్జీలు ఉంటాయని తెలిపారు.

అంటు వ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ఉండాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి

జుక్కల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండలం బంగారు పల్లి గ్రామంలో గత నాలుగు రోజుల నుండి గ్రామంలో ఉన్న కొందరు అంటువ్యాధులు సోకి జ్వరాలు వస్తున్నాయి సమాచారం తెలుసుకున్న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి బంగారు పల్లి గ్రామానికి సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులు పరీక్షలు నిర్వహించుకోవాలని ఆమె సూచించారు. అదేవిధంగా గ్రామంలో గుంతలలో నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు పాటించాలని గ్రామస్తులకు కోరారు. ఇంటి పరిసరాలలో అంటూ వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ఆమె గ్రామస్తులు సూచించారు. జ్వరాల బారిన పడిన ప్రజలకు శిక్షణ శిబిరంలో వైద్యులు చికిత్సలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ రాము, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్: మండలంలోని ఆయా గ్రామా లలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండ పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని మండల ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షకాలం అయినందున గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో పారిశుధ్యం నిర్వహణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఏపీవో సుదర్శన్ పాల్గొన్నారు.

అఖిల భారత రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకుడిగా తలారి సంజీవయ్య

వేల్పూర్,జూలై2 (ఆంధ్రజ్యోతి):వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామానికి చెందిన తలారి సంజీవయ్య అఖిల బారత రైల్వే మజ్దూర్ యూ నియన్ నాయకుడిగా నియమితులయ్యారు. సంజీవయ్య ప్రస్తుతం సికింద్ర బాద్‌లోని రైల్వే నిలయంలో సీనియర్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.బుధ, గురువారాలలో అఖిల భారత మజ్దూర్ యూనియన్ విజయవాడలో జరు గుతున్న మహసభలలో సంజీవయ్య పాల్గొని ప్రసంగించారు.అఖిల భారత రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకుడిగా తమ గ్రామానికి చెందిన సంజీవయ్య నియమితుడైన సందర్భంగా రిటైర్డ్ ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం అశోక్,గ్రా మమాజీ ప్రజాప్రతినిధులు,దళితసంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

యంచ గోదావరి వద్ద పుష్కర ఘాట్‌ను ఏర్పాటు చేయాలి

నవీపేట,జూలై2(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచ గోదావరి వద్ద పుష్కర ఘాట్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం పలువురు గ్రామస్థులు హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. నిజామాబాద్ సరిహద్దున ఉన్న యంచలో అతి పురాతనమైన ఆలయాలు ఉన్నాయని స్థానిక గోదావరి ఒడ్డున పుష్కర ఘాట్ లేకపోవడంతో భక్తులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు. రాబోయే గోదావరి పుష్కరాలలోగా స్థానికంగా పుష్కర ఘాట్‌ను నిర్మించాలని వారు తమ వినతిపత్రంలో పేర్కొన్నారు.

- యంచ గోదావరి బ్రిడ్జికి ఇరువైపులా ఇనుప జాలీలు ఏర్పాటు చేయాలి

మండలంలో యంచ గోదావరి రోడ్డు బ్రిడ్జికి ఇరువైపులా ఇనుప జాలీలతో రక్షణ గోడను ఏర్పాటు చేయాలని పలువురు యంచ గ్రామస్థులు బుధవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. వివిధ కారణాలతో గత కొన్ని సంవత్సరాలుగా చాలా మంది రోడ్డు బ్రిడ్జిపై నుండి గోదావరి నదిలో దూకి ఆత్మహత్యలకు పాల్పడ్డారని వారు వివరించారు. స్థానిక యువకులు కలిసి గస్తీ దళాలు ఏర్పాటు చేసుకోవడంతో ఇప్పటి వరకు నదిలో దూకి ఆత్మహత్య యత్నానికి పాల్పడుతున్న వందలాది మందిని కాపాడడం జరిగిందని వారు పేర్కొన్నారు. రోడ్డు బ్రిడ్జికి ఇరువైపులా 6ఫీట్ల ఎత్తులో ఇనుప జాలీలతో రక్షణ గోడను ఏర్పాటు చేయడంతో పాటు పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేయాలని వారు తమ వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోటగిరి,జూలై2(ఆంధ్రజ్యోతి):కోటగిరిలో బుధవారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఐ సునీల్ పట్టుకున్నారు.అనుమతి లేకుండాఇసుకనురవాణా చేస్తుండడంతో ట్రాక్టర్‌నుపోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యాజమాని సంజీవ్ పటేల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భీమ్‌గల్ ఎస్సైకి సన్మానం

భీమ్‌గల్, జూలై2 (ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన సందీప్‌ను భారతీయ జనతాపార్టీ ఎస్ఎస్‌యుఐ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్‌శాఖకు సహకరిస్తామని ఈ సందర్భంగా ఎస్ఐకి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ఆరే రవీందర్, రాష్ట్ర కౌన్సిలర్ మెంబర్ యోగేశ్వర నర్సయ్య, జిల్లా బీజేవైఎం నాయకులు కొట్టాల అశోక్, మండల ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు భూక్య మోహన్, ఎస్టీసెల్ ఉపాధ్యక్షుడు వెంకటేష్, మండల ప్రధానాధికారులు హరిప్రసాద్, కర్క నారాయణరెడ్డి, అశోక్, దేవేందర్, మహేందర్, సునీల్, ఎన్ఎస్‌యుఐ నాయకుడు రెహమాన్, శ్రీకాంత్, వినీత్, తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరు చర్చి చౌరస్తా





అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్డు



చర్చి చౌరస్తా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన దృశ్యం

డేంజర్ స్పాట్

- భిక్కనూరు చర్చి చౌరస్తా వద్ద నిత్యం ప్రమాదాలు
- రోడ్డుకు ఇరువైపులా అసంపూర్తిగా సర్వీస్ రోడ్డు
- బ్రిడ్జి నిర్మించాలని చాలా సంవత్సరాలుగా డిమాండ్
- లేదంటే ప్రత్యామ్నాయ మార్గం చూపాలని వేడుకోలు

భిక్కనూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): చర్చి చౌరస్తా అంటేనే చుట్టూ గ్రామాల ప్రజలకు హడల్. నిత్యం ప్రమాదాలతో డేంజర్ స్పాట్‌కు కేరాఫ్‌గా మారింది. అక్కడ రోడ్డు క్రాస్ చేద్దామంటే ప్రాణం అరచేతిలో పెట్టుకోవాల్సిందే. ఇదే భిక్కనూరు మండలకేంద్రంలోని 44వ జాతీయరహదారిపై ఉన్న చర్చి చౌరస్తా వద్ద కూడలి. నాలుగులైన్ల రోడ్డు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ఈ కూడలిలో చాలా రోడ్డు ప్రమాదాలు జరగగా చాలా మంది మృతిచెందారు. ఈ కూడలి చుట్టూ గ్రామాల ప్రజలకు సెంటర్ పాయింట్‌గా ఉండగా 44వ జాతీయ రహదారిని విస్తరించిన సమయంలో బ్రిడ్జి చేపట్టకుండా కేవలం డివైడర్ మాత్రమే ఇచ్చారు. కాస్త ముందు ఎల్లమ్మ గుడి సమీపంలో బ్రిడ్జి నిర్మించిన దానికి సరైన సదుపాయాలు కల్పించక పోగా రోడ్డుకు ఇరువైపుల ఉన్న సర్వీస్ రోడ్డును నేషనల్ హైవే అధికారులు పూర్తి చేయకుండా అసంపూర్తిగానే వదిలేశారు. దింతో గత్యంతరం లేక భిక్కనూరు మండలకేంద్రం వైపు వెళ్లే వాహనదారులు ఇక్కడే డివైడర్ వద్ద రోడ్డు దాటుతుండగా నిత్యం ఏదోవిధంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాల నివారణకు పోలీసులు ఎన్నివిధాలుగా ప్రయత్నించిన ఈ స్థలంలో మాత్రం రోడ్డు ప్రమాదాలను ఆపలేక పోతున్నారు. ఈ చౌరస్తా వద్ద బ్రిడ్జి నిర్మించాలని గత చాలా సంవత్స రాలుగా పట్టణ ప్రజలతో పాటుగా మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళనలు చేస్తున్నప్పటికీ ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఏమాత్రం స్పందించడం లేదు. ఇప్పటికైనా ఈ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డున పడ్డ ఎన్నో కుటుంబాలు..

ఈ స్థలంలో జరిగినా చాలా ప్రమాదాల్లో ఇంటి పెద్దదిక్కు మరణించిన కుటుంబాలు ఎన్నో రోడ్డున పడగా, చేతికందిన కొడుకులు మరణించిన కుటుంబాల బాధ వర్ణణాతీతం. ఈ స్థలంలో ఇప్పటివరకు చాలామంది మరణించగా అంతకంటే ఎక్కువ సంఖ్యలో గాయపడినవారున్నారు. మరణించిన వారి కుటుంబసభ్యులైతే ఈ చౌరస్తాను తలుచుకుంటేనే భయాందోళనకు గురవడంతో పాటుగా జరిగిన ప్రమాదాన్ని గుర్తుచేసుకుంటూ రోదిస్తున్న పరిస్థితి ఉంది.

రోడ్డుకు ఇరువైపులా అసంపూర్తిగా సర్వీస్ రోడ్డు


చర్చి చౌరస్తా వద్ద కాకుండా ఎల్లమ్మ ఆలయ సమీపంలో ఉన్న బ్రిడ్జి కింది నుండి భిక్కనూరు వైపు వెళ్దామంటే రోడ్డుకు ఇరువైపుల ఉన్న సర్వీస్ రోడ్డును నేషనల్ హైవే అధికారులు పూర్తిచేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. దీంతో మట్టిరోడ్డుపై చెట్లు మొలకెత్తి రోడ్లు ఇరువైపుల అధ్వానంగా తయారయ్యాయి. దీంతో గత్యంతరం లేక చర్చి చౌరస్తా వద్దనే వాహనదారులు రోడ్డు దాటుతున్నారు. రోడ్డుపై వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో రోడ్డుదాటుతున్న సమయంలో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ సర్వీస్ రోడ్డును ఇప్పటికైనా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మించాలని గత చాలా సంవత్సరాలుగా డిమాండ్.

భిక్కనూరు మండలకేంద్రంలోని 44వ జాతీయరహదారిపై చర్చి చౌరస్తా వద్ద బ్రిడ్జి నిర్మించాలని పట్టణ ప్రజలతో పాటుగా మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు చాలా సంవత్సరాలుగా డిమాండ్ చేస్తూ ఆందోళలు చేస్తున్న హైవే అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.గతంతో ఈ చర్చి చౌరస్తా వద్ద జాతీయరహదారి దిగ్బంధించిన సంఘటనలు ఉన్నాయి. ఆందోళన సమయంలో బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హైవే అధికారులు హామీ ఇచ్చిపప్పటికీ ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా నేషనల్ హైవే అధికారులు స్పందించి చర్చి చౌరస్తా వద్ద బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం..

- ఆంజనేయులు, ఎస్సై భిక్కనూరు



భిక్కనూరు మండలంలోని ఆయా ప్రాంతాల వద్ద రోడ్డు ప్రమా దాల నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఇప్పటికే ఆయాగ్రామాల వద్ద బారికేడ్ల ఏర్పాటు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం జరిగింది. చర్చి చౌరస్తా వద్ద సైతం డ్రమ్ములు, బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నాం. వాహనాదారులు సైతం రోడ్డు దాటుతున్న సమయంలో జాగ్రత్తలు పాటించాలి. ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మట్ ధరించాలి.

బ్రిడ్జిని వెంటనే నిర్మించాలి

- బద్రి, భిక్కనూరు



భిక్కనూరు చర్చి చౌరస్తా వద్ద 44వ జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కు వగా జరుగుతున్నాయి. ఈ స్థలంలో బ్రిడ్జి నిర్మించాలని చాలా సంవత్సరాలుగా తాము ఆందోళన చేస్తున్న హైవే అధికారులు స్పందించడం లేదు. ఈ ప్రాంతంలో బ్రిడ్జి లేకపోవ డంతోనే ప్రమాదాలకు నెలవుగా మారింది. ఇప్పటికైనా ఈ ప్రాం తంలో హైవే అధికారులు బ్రిడ్జి నిర్మించాలి. లేని యెడల పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతాం.

అంతా కలిసికట్టుగా..

- కులమతాలకు అతీతంగా పండుగలు
- ఆదర్శంగా నిలుస్తున్న గండివేట్‌గ్రామం
- గ్రామస్థులంతా కలిసి కందూరును నిర్వహించుకోవడం ఆనవాయితీ
- రేపటి నుంచి కాసిందుల సవాల్ ఉత్సవాలు

గాంధారి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): గాంధారి మండలంలోని గండివేట్ గ్రామంలో ఉన్న దర్గా వద్ద ప్రతీ సంవత్సరం ఒకరు మొక్కిన మొక్కులు కందూరు రూపంలో చెల్లించుకుంటారు. ఎక్కువగా ప్రతి శుక్రవారం దర్గా వద్ద ప్రత్యేకంగా పండుగను భక్తులు నిర్వహిస్తారు. గాంధారి మండలంలోని గండివేట్ గ్రామంలో చాలా సంవత్సరాలుగా ఇక్కడ దర్గాను దర్శించుకోవడం ఇతర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో పీర్ల పండుగ కంటే ముందు ఎప్పుడైన మొక్కులను ఈ దర్గా వద్ద చెల్లిం చుకుంటారు. దీంతో పాటు గండివేట్ గ్రామంలోనిదర్గా వద్ద సంవత్స రంలో ప్రతిరోజు కూడా దర్గా వద్ద మొక్కులను చెల్లించుకుని కందూరు నిర్వహిస్తుంటారు. దీంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన భక్తులు మొక్కులే పనులవుతాయని నమ్మకంతో పీర్లపండుగకు ఒకరోజు ముందుగానే గండివేట్ గ్రామానికి వచ్చి ఉంటారు. గ్రామంలో నిర్వహించే ఈ పండుగకు ఓ ప్రత్యేకత ఉంది రాష్ట్రం నుంచే కాకుండా మహారాష్ట్రలోని ముంబాయితో పాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో గ్రామానికి వచ్చి పండుగను జరుపుకుంటారు.ఈ పండుగకు గ్రామంలోనే కాకుండా చుట్టుపక్కల గ్రామాల వారు కూడా తమ ఇళ్లను రంగులతో శుద్ధిచేసుకుని పండుగ పూర్తి అయ్యేవరకు నియమాలు పాటిస్తూ మొక్కులు చెల్లించుకుంటారు. సీతాయిపల్లి, గండివేట్ గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాలలో ప్రతీ ఇంట్లో ఒకరికి కాశీందుల పేర్లు వచ్చేలా కా అనే అక్షరంపై పేర్లు ఉంటాయి. ప్రతి సంవత్సరం జరిగే ఈ ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తారు. శుక్రవారం,ఆదివారం, బుధవారాల్లో నిర్వహించే మొహరం పండుగ పీర్లను ముస్తాబ్ చేస్తారు. ఈ సందర్భంగా పీర్లను కూర్చుండబెట్టి దగ్గర రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి పీర్లను ఏర్పాటుచేస్తారు. ఉత్సవాలకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలను భక్తులకు ఏర్పాటుచేస్తుంటారు. ఈ ప్రాంతంలో దుకాణాల సముదాయాలు ఏర్పాటు చేసేందుకు అన్ని రకాల వసతులను కల్పిస్తారు.



గండివేట్ గ్రామంలో కాసిందుల్ల సవార్‌కు ముస్తాబైన పీర్లు

పీర్లపండుగను ఎంతో పవిత్రంగా జరుపుకుంటారు

కాసిందుల్ల పండుగకు ఓ చారిత్రాత్మక నేపథ్యం ఉంది. మహారాష్ట్ర ప్రాంతాల నుంచి దొంగలు పీర్లను దొంగిలించుకుని వస్తుండగా గండివేట్ గ్రామ శివారులోని అటవీప్రాంతంలోకి రాగానే దొంగలకు దాహం వేయడంతో పీర్లను బండరాళ్లపై నిలబెట్టి నీళ్లు తాగడానికి వెళ్లారు. ఆ తర్వాత దొంగలు వచ్చి పీర్లను అక్కడి నుంచి తీసుకెళ్లేం దుకు ప్రయత్నం చేయగా అక్కడి నుంచి కదలలేదు. దొంగలు ఎంత ప్రయత్నించిన ఫలితం లేకపోవడంతో పీర్లను అక్కడే వదిలేశారు. దొంగలకు పీర్లు కదలకపోవడంతో వెను తిరుగగానే వాంతులు, విరోచనాలు అయినట్లు పూర్వికులు తెలిపారు. అప్పుడు పీర్ల పండుగను ముందు అక్కడ కొంతమంది పీర్లను చూసి గ్రామస్థులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న గ్రామస్తులు పీర్లకు పూజలు నిర్వహించారు. అప్పట్నుంచి పీర్ల పండుగ కంటే ముందే కాసిందుల్లా సవార్ నిర్వహిస్తుంటారు. ఇక్కడ కాసిందుల్లా సవార్ ఉత్సవాలకు ప్రజలకు పెద్ద ఎత్తున కందూరు మేకలతో చేసుకుంటారు. ఆనాటినుంచి కాసిందుల ఉత్సవాలకు ప్రతి సంవత్సరం వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్ర ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివస్తారు.

చాలా సంతోషంగా నిర్వహిస్తాం

- ఉప్పు సాయిలు, గండివేట్



వివిధ గ్రామాల నుంచి గాంధారి మండలం గండివేట్‌లో నిర్వహించే కాసిందుల్లా సవార్‌కు తప్పనిసరిగా బంధువులను పిలుచుకోవడం ఆనవాయితీ. ఎన్ని పనులున్న ఇక్కడ పండుగను ఘనంగా నిర్వహిస్తాం. ఇక్కడ గతంలో ఎడ్లబండ్లపై గండివేట్ గ్రామానికి వచ్చేవాళ్లు ఇప్పుడు కూడా పండుగకు వాహనాల్లో వస్తుంటారు. అందరికి వసతులు ఏర్పాటుచేస్తాం.

కాసిందుల పేర్లు అధికం

- షాదుల్,గండివేట్



గాంధారి చుట్టు పక్కల గ్రామాల వారు కూడా కాసిందుల పేర్లు వచ్చేవిధంగా క అక్షరంపైనే అధికంగా పేర్లు పెడతారు. ఇక్కడ అన్ని వర్గాల,మతాల వారు పండుగలను కలిసికట్టుగా నిర్వహించుకుంటాం.



పంట పొలాల్లో మద్యం సీసాలు కుప్పలుగా వేసిన దృశ్యం

మద్యం సీసాలు రైతుల పాలిట శాపాలు

- రైతులు, మూగజీవాలకు పొంచి ఉన్న ప్రమాదం

ఎల్లారెడ్డి రూరల్, జూలై 2(ఆంధ్రజ్యోతి): రబీ పంటలు చేతికందాక రైతులు కాస్త సేద తీరుతారు. వేసవీకాలంలో పంట పొలాలు ఖాళీగా మారతాయి. వేసవీకాలం అత్యధికంగా మద్యం ప్రియులు గుంపులు గుంపులుగా ఆరు బయట పంటపోలాల్లో సరదాగా సిట్టింగులు వేసి పార్టీలు చేసుకోవడం ఇటీవల అధికమవుతుంది. ఎల్లారెడ్డి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో నిత్యం పంట పొలాలలో మద్యం సీసాలు తాగి పారేయడం అధికంగా కనిపిస్తుంది. కళ్యాణి, తిమ్మారెడ్డి, వెల్లుట్ల గ్రామశివారులో ప్రధాన రహదారి పక్కనే పంట పొలాలలో తాగుబోతులు సిట్టింగులు వేసి మద్యం తాగుతున్నారని ఆయా గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర వుతున్నాయి. పంట పొలాలు ఖాళీగా ఉనన వేసవీకాలంలో అంతా ఈ విధంగా యథేచ్ఛగా ఎక్కడా చూసిన మద్యం సీసాలే దర్శనమిస్తున్నాయి. ఎప్పుడైనా ఎక్కడైనా ఖాళీగా పొలాలు కనిపిస్తే కొంతమంది తాగుబోతులు అదే అల వాటుగా కూర్చుని మద్యం తాగుతుంటారు. వాటితో రైతులు పంటలు సాగు చేస్తున్న సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. ఆకతాయిలు తాగి పారేసిన ఖాళీ సీసాలను పగుల గొట్టి సరదా పడుతుంటారు. వారి సరదా రైతులకు, మూగజీవాలకు శాపంగా మారుతుంది. వర్షాకాలం జూన్, జూలై మొదలవగానే రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతారు. పంట పొలాల్లో విచ్చలవిడిగా తాగు బోతులు, ఆకతాయిలు పగులగొట్టిన గాజుసీసాలు చాలా పదునుగా అత్యంత ప్రమాదంగా మారుతాయి. వాటిని గుర్తించిన రైతులు అవి ఏర వేసి తొలగించడానికి నానా కష్టాలు పడాల్సి వస్తుంది. కొన్ని పదునైనా సీసా ముక్కలు దుక్కిన దుక్కుల్లో పొలం అంతా వ్యాపించి నాటు వేసే సమయంలో రైతులకు, రైతు కూలీలకు నాగలితో దున్నే ఎద్దుల కాళ్లకి నాటు వేసే కూలీలకు గుచ్చుకుంటే ఆ బాధ ఎలా ఉంటుందో ఊహించుకోవడానికి అత్యంత ఘోరంగా ఉంటుంది. మద్యం ప్రియులు వేసవీకాలంలో ప్రశాంతమైన వాతవరణం చట్లటిగా ఆరు బయట సిట్టింగు అంటు కొంతమంది కలిసి గుంపులు గుంపులుగా మిత్రులతో కలిసి ఊరుబయట పంటపొలాలలో మద్యం తాగుతూ పొలం అంతా సీసాలతో నిం పేస్తున్నారు. అవి వర్షాకాలంలో అపాయకరంగా మారుతున్నాయి. పగిలిన సీసా ముక్కలు ఏరిపారేయడం రైతులకు సవాలుగా మారుతుంది. విచ్చల విడిగా పెరిగిన బెల్టుషాపులతో ప్రభుత్వ ఆధాయం పెరగడం ఏమోగానీ రైతులకు జరిగే నష్టం తీవ్రంగా ఉంటుంది. ఆచితూచి అడుగేసే మనుషులకే ఇంత ప్రమాదకరమైతే దుక్కిదున్నే కాడేద్దులకు ఎంత ప్రమాదం పొంచి ఉందో అర్థమవుతుంది. మద్యం సీసాల వలన కలిగే అనర్థాలను ప్రమాదాలను పసి గట్టి మూగజీవాల కోసం, రైతుల కోసం విచ్చలవిడిగా పంట పొలాల్లో మద్యం సీసాలను వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మద్యం సీసాలు ప్రమాదకరంగా మారుతున్నాయి..

- భూమయ్య, రైతు కళ్యాణి



మా పంట పొలం ప్రధానరోడ్డుకు సమీపంలో ఉంటుంది తాగుబోతులు పగలు, రాత్రిఅనే తేడా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు మద్యం తాగి ఆ సీసాలను అక్కడే పగుల గొట్టడంతో ఆ పదునైనా సీసాముక్కలు మాకు ప్రమాదకరంగా మారుతున్నాయి. వాటిని ఏరివేయడం మాకు సవాలుగా మారుతుంది. పంట సాగు పనులు చేసుకునే క్రమంలో పగిలిన సీసా ముక్కలతో తమకు అపాయం కలుగుతుంది.

ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న బోధన్ డిపో మేనేజర్

బోధన్‌రూరల్, జూలై2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బోధన్ డిపో పరిధి నుండి ప్రయాణికుల సౌకర్యార్థం దూర ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథ్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి బోధన్ నుండి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, అరుణచలానికి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పౌర్ణమి రోజు గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత తిరుగు ప్రయాణంలో అల్లంపూర్ జోగులంబ దర్శనం చేసుకుని తిరిగి 11వ తేదిన బోధన్‌కు బస్సు చేరుకుంటుందన్నారు. 5వ తేదిన బోధన్ ఆర్టీసీ డిపో నుండి ఉదయం 9గంటలకు సోలాపూర్, తుల్జాపూర్ మీదుగా పండరీపూర్ చేరుకుని దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో గానుగపూర్, బీదర్ నరసింహ స్వామి దర్శనం చేసుకుని బోధన్‌కు చేరుకుంటుందన్నారు. ఒక్కో ప్రయాణికుడికి డీలక్స్ బస్సు చార్జి రూ.1700 ఉంటుందన్నారు. 5, 12, 19, 26 తేదీలలో ప్రతీ శనివారం మామిడిపల్లి అపురూప వెంకటేశ్వర స్వామి టెంపుల్, ధర్మపురి, కొండగట్టు, వేములవాడకు ప్రత్యేక టూర్ ప్యాకేజీ డీలక్స్ బస్సు నడుపబడుతుందన్నారు. ఉదయం 5గంటలకు బయల్దేరి రాత్రి 10గంటలకు బస్సు చేరుకుంటుందన్నారు.ఒక్కో ప్రయాణికుడికి చార్జి రూ.700లు ఉంటుందన్నారు. కావున ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్సులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వంతెన నిర్మించారు.. రోడ్డు వేయడం మరిచారు!

- నిధుల్లేక నిలిచి పోయిన అప్రోచ్ రోడ్డు పనులు
- వంతెన నిర్మాణం పూర్తయి రెండున్నరేళ్లు గడిచినా ముందుకు సాగని పనులు

సిరికొండ, జులై 2 (ఆంధ్రజ్యోతి): వంతెన నిర్మాణ పనులు పూర్తయి రెండున్నర - మూడేళ్లు కావస్తున్నా అప్రోచ్ రోడ్డు పనులు వేయించడంలో అధికారులు విఫలమయ్యారు. రోడ్డు నిర్మాణం కాపోవడానికి ప్రధాన కారణం నిధులు లేకనే నిలిచిపోయినట్లు సమాచారం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆనాటి ఎమ్మెల్యే ఆర్టీటి చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ పంది మడుగు - దూప్య తండాల మధ్య గల వాగుపై వంతెన ని ర్మాణానికి కోటి 50 లక్షలు మంజూరు చేయించారు. పనులు కూడా పూర్తయి రెండున్నరేళ్లు పూర్తయ్యింది. ఆనాటి నుంచి వంతెనకు అటు ఇటు వైపుల అప్రోచ్ రోడ్డు నిర్మించలేక పోయారు. పందమడుగు నుంచి దూప్య తండాకు వెళ్లాలన్న, దూప్య తండా నుంచి పంది మడుగు మీదుగా సిరికొండ రావాలన్న అప్రోచ్ రోడ్డు అవరం అత్యవసరం ఉంది. అప్పట్లో కాంట్రాక్టర్ కొంత మేరకు రోడ్డు వేసిన చేయాల్సినంత పని చేయలేక పోయారని విమర్శలు వినిపిస్తున్నాయి. తండా వాసులు కూడ కొంత మేరకు రోడ్డు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. వంతెన గోడలకు అనుకుని మట్టిని వేయక పోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెపుతున్నారు. వంతెన పనులు పూరతయ్యి రెండున్నర, మూడేళ్లు కావస్తున్న ప్పటికీ అధికారులు కాని ప్రజా ప్రతినిధులు కాని అప్రోచ్ రోడ్డును బాగు చేయించాలనే ఆలోచన రాక పోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు అంటున్నారు.

అప్రోచ్ రోడ్డు నిర్మించాలి..

వంతెనకు రెండు వైపులా అప్రోచ్ రోడ్డు వేయించాలని దూప్య తండా గిరిజనులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల తండా వాసుల కోరిక నెరవేరిందని అనుకుంటున్న గిరిజనులకు అప్రోచ్ రోడ్డు వేయక పోవడం ఆందోళన కలిగిస్తుంది. అప్పుడప్పుడు చిన్న చిన్న ప్రమాదాలు జరుగుతున్నాయని తండా వాసులు చెపుతున్నారు. అందుకని అధికారులు అప్రోచ్ రోడ్డు వేయడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మట్టిని పోయక పోవడం వల్ల ప్రమాదకరంగా మారిన వంతెన

నిధులు సరిపోకనే పనులు నిలిచి పోయాయి

అప్రోచ్ రోడ్డు వేయడానికి కావలసిన నిధులు సరిపోక పోవడం వల్లె నిర్మించలేదని సమాచారం. వాస్తవానికి వంతెన ప్రతిపాదనలు హైలెవల్ లేదని బావించిన ఇంజనీరింగ్ అధికారులు రివైజ్ చేసి వరద నీటి ప్రవాహం అధికంగా ఉంటుందని గ్రహించి వంతెన ఎత్తు పెంచడం వల్ల మంజూరైన నిధులు సరిపోలేదని అధికారులు చెపుతున్నారు. నిధులు సరిపోకపోవడం వల్లే పనులు చేయలేదని సమాచారం.

నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం..

అదనపు పనులు చేయడానికి నిధులు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని పంచాయతీ రాజ్ డీఈఈ అహ్మద్ హుస్సేన్ చెప్పారు. వంతెనకు రెండు వైపుల వంద మీటర్ల చొప్పున అప్రోచ్ రోడ్డు నిర్మాణంతో పాటు సిమెంట్ కాంక్రిట్‌తో సైడ్ వాల్స్ నిర్మాణం, వంతెనకు అటు, ఇటు మధ్యలో సిమెంటు రోడ్డు వేయాల్సిన దాని కోసం కోటి 20 లక్షలు కావాలని ప్రతిపాదనలు పంపించినట్లు ఆయన చెప్పారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని డీఈఈ అహ్మద్ హుస్సేన్ చెప్పారు.

దూప్య తండా వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు పనులు నిర్మించాలి

- మాలవత్ మహేందర్

దూప్య తండాకు వెళ్లే వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మాంచాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మాలవత్ మహేందర్ ప్రభుత్వాన్ని కోరారు. అప్రోచ్ రోడ్డు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన చెప్పారు. అధికారులు స్పందించి రోడ్డు వేయడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



గడ్కోల్‌లో ఎర్ర జండాను ఎగరవేస్తున్న నారాగౌడ్

రైతులను మోసం చేస్తున్న మోదీ ప్రభుత్వం

● ఏఐయూకేఎస్ రాష్ట్ర కార్యదర్శి

సిరికొండ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పదకొండేళ్లుగా కేంద్రంలో పాలన చేస్తున్న నరేంద్రమోదీ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని ఏఐయూకేఎస్ రాష్ట్ర కార్యదర్శి దేవరాం అన్నారు. మండలంలోని గడ్కోల్‌లో జరిగిన ఏఐయూకేఎస్ మండల మహాసభలో దేవరాం మాట్లాడారు. అంతకు ముందు అధ్యక్షుడు నారాగౌడ్ ఎర్రజండాను ఎగరవేయగా.. ప్రతినిధులు అమరవీరులను స్మరిస్తూ మౌనం పాటించారు. ఈ సందర్భంగా దేవరాం మాట్లాడారు. రైతులకు గిట్టుబాటు ధర లభించక, పంటలపై పెట్టుబడి వ్యయం పెరగడం వల్ల అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగంలో స్వామినాథన్ కమిషన్ సిఫారసుల అమలుకు కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని దేవరాం ఆరోపించారు. రైతులు సంఘటితమై తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాటాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ (మాస్‌లైన్) నాయకులు రామకృష్ణ, రమేష్, ఏఐయూకేఎస్ జిల్లా అధ్యక్షుడు సురేష్, జిల్లా కార్యదర్శి బాబన్న, రమేష్ దామోదర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యాబోధన



మిట్టపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

డిచ్‌పల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యాబోధన లభిస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థుల సంఖ్య పెంచేందుకు తమవంతు కృషి చేయాలని ఎంపీడీవో బూక్య లింగం నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని మిట్టపల్లిలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తీరుతెన్నులను హెడ్‌మాస్టర్ సుశీల్‌కుమార్‌తో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం అందిస్తున్న కారణంగా ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్యాబోధన లభిస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థులను పంపించకుండా అన్ని గ్రామాల్లో నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కోరారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను కార్యదర్శి నరేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

ఇందల్వాయి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లవెల్లి గ్రామంలో ప్రాథమిక అర్జనవాడ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నల్లవెల్లి గ్రామ వీడీసీ సభ్యులు నోట్‌బుక్‌లను విద్యార్థులకు బుధవారం పంపిణీ చేశారు. ఈయేడాది కొత్తగా ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్‌బుక్‌లను ప్రభుత్వం ఉచితంగా అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షులు నోముల శ్రీనివాస్‌రెడ్డి, విద్యా కమిటీ సభ్యులు ఆసది మురళి, రాజన్న, వడ్ల రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

5న బైక్ ర్యాలీని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న నాయకులు

నిజామాబాద్ కల్చరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సన్నాహక కార్యక్రమంలో భాగంగా ఈనెల 5న జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ ప్రధానకార్యదర్శి నూర్జహాన్, ఏఐటీయుసీ ఓమయ్య, టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ పిలుపునిచ్చారు. సీఐటీయు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడ్స్‌లను అమలులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తుందని అన్నారు. బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను కార్మిక వర్గం ఐక్యతతో ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో తెలంగాణ రాష్ట్రంలోని కార్మిక, ఉద్యోగ సంఘాలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, శివ, తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవెలెబుల్ స్కూల్ స్కీమ్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజన విద్యార్థులకు 2025-26 విద్యాసంవత్సరానికి గాను ఇంగ్లీష్ మీడియంలో 3, 5, 8వ తరగతులలో ప్రవేశం కోసం బాల బాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నాగోరావు ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.లక్షా 50వేలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షలకు మించరాదని ఇటీవల పొందిన కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. తోటి, చెంచు, గిరిజన అదిమతి తెగలు విద్యార్థులకు 2 సీట్లు ఉన్నాయన్నారు. దరఖాస్తు ఫారాలను ఈనెల 3వ తేదీ నుంచి జిల్లా కలెక్టరేట్‌లోని రూమ్ నెంబర్ 208లో గల జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయం నుంచి పొంది ఈనెల 7న సాయంత్రం 5గంటలలోపు అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 9912086022 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు..

నిజామాబాద్ అర్బన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా 10వ తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల కొరకు 2025-26 విద్యాసంవత్సరానికి గాను ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తెలిపారు. 14 సంవత్సరాలు పైబడిన వారు, చదవడం, రాయడం వచ్చిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంటర్మీడియెట్ కోసం 15 సంవత్సరాల పైబడిన వారు, 10వ తరగతి పాసైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. 10వ తరగతికి రూ.1150, ఇంటర్మీడియెట్‌కు రూ.1500 ఫీజు చెల్లించుకోవాలని, ఓపెన్‌స్కూల్ ద్వారా పాసైన సర్టిఫికెట్లు రెగ్యూలర్ బోర్డులతో సమానం అని ఆసక్తిగల అభ్యర్థులు తెలంగాణ ఓపెన్‌స్కూల్.ఓఆర్‌జి వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని లేదా ఇతర వివరాలకు ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ తూల రవీందర్ 9908896096 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

తెలంగాణకు ఎరువుల కేటాయింపులో కేంద్రం వివక్ష చూపిస్తోంది

● రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్

నిజామాబాద్ అర్బన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి):తెలంగాణకు ఎరువుల కేటాయింపులో కేంద్రం వివక్ష చూపిస్తోందని రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని హాకా భవన్‌లో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి రైతు సంక్షేమ పాలన సాగిస్తుంటే ప్రధాని మోదీ సహకరించడం లేదన్నారు. రాష్ట్రంలో రుణమాఫీ, రైతుభరోసా, సన్నాలకు బోనస్, ఉచిత కరెంటు అందిస్తుంటే కేంద్రం మాత్రం రాష్ట్రానికి ఎరువులు కేటాయించడం లేదన్నారు. ఇంత జరుగుతున్నా కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ఉండి ఏం ప్రయోజనం అని వారు అన్నారు. ప్రతీనెలా ఎరువుల కేటాయింపులు సరిపడా చేయడం లేదని అందువల్లే రైతులకు ఎరువుల కొరత ఏర్పడిందన్నారు. ఇప్పటికే ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన కోటా కింద 5లక్షల మెట్రిక్ టన్నులు కేటాయిస్తే జూలై నెల వచ్చిన ఇప్పటికీ ఇంకా సగం ఎరువులు సరఫరా చేయలేదన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ మంత్రి పలుమార్లు లేఖలు రాసిన కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు లెటర్ హెడ్, క్యాంప్ ఆఫీసు లేదు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి



సమావేశంలో మాట్లాడుతున్న దినేష్ కులాచారి

సుభాష్‌నగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డికి ఇప్పటికీ లెటర్ హెడ్ లేదని, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డికి క్యాంప్ ఆఫీస్ లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమిత్‌షా పర్యటనపై రూరల్ ఎమ్మెల్యే అనవసరంగా మాట్లాడుతున్నారని, భూపతిరెడ్డికి ప్రజల సమస్యలు వినడానికి ఇప్పటికీ కార్యాలయం లేదన్నారు. బీఆర్ఎస్ పది సంవత్సరాలు అధికారంలో ఉండి పసుపు రైతులకు ఏం చేసిందని అన్నారు. పసుపు బోర్డుపై అనవసరంగా మాట్లాడితే పసుపు రైతులు ప్రశాంత్ రెడ్డిని, జీవన్ రెడ్డిని, కవితను క్షమించరని అన్నారు. జాతీయ బోర్డుకు జిల్లా నుంచి ఏ ఒక్కరన్నా చైర్మన్ పదవి చేసారా అని ప్రశ్నించారు. బీజేపీ సామాన్య రైతును గుర్తించి జిల్లాకు చెందిన పల్లె గంగారెడ్డిని జాతీయ చైర్మన్‌ను చేసిందన్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పసుపు బోర్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. బీజేపీ అధ్యక్షుడిపైన ట్రోల్స్ చేసే వారంతా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులేనన్నారు. బీజేపీ తీసుకున్న నిర్ణయానికి ప్రతి కార్యకర్త కట్టుబడి ఉంటారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచేందుకు అందరు కృషిచేస్తామన్నారు. అమిత్ షా సభను విజయవంతం చేసిన రైతులందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి న్యాలం రాజు, గంగోనె సంతోష్, నాగోళ్ల లక్ష్మీనారాయణ, మాస్టర్ శంకర్, కిషన్, ఆకుల శ్రీనివాస్, మధు, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఈఈ మురళి

తడి, పొడి చెత్తపై అవగాహన సదస్సు

సుభాష్‌నగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో తడి చెత్త, పొడి చెత్తపై అవగాహన సదస్సు నిర్వహించారు. నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో తడి చెత్త పొడి చెత్త వేరు చేయడంపై అధికారులకు అవగాహన కల్పించారు. మున్సిపల్ ఈఈ మురళి, అడిషనల్ కమిషనర్ జయకుమార్ ఆధ్వర్యంలో అధికారులకు అవగాహన కల్పించారు. తడి చెత్త పొడి చెత్త వేరు చేయకపోవడం వల్ల కార్మికులకు ఇబ్బందులు ఎదురవుతాయని తడి చెత్త పొడి చెత్త వేరు చేస్తే తేలికగా చెత్తను శుభ్రం చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 9 నుంచి గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె

డిచ్‌పల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రెక్కాడితే డొక్కాడని నిరుపేద కుటుంబాల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వీడాలని గడిచిన మూడు నెలలుగా పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వకపోతే ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఈ కారణంగా ఈనెల 9 నుంచి సార్వత్రిక సమ్మెకు దిగుతున్నట్లు ఎంపీడీవో బూక్య లింగంకు పంచాయతీ కార్మిక ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో శ్యామ్‌సన్, సాయిలు, లక్ష్మి, గంగామణి, జేపీ గంగాధర్‌లు ఉన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

నిజామాబాద్ అర్బన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో మ్యాజిక్ బస్సు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు అనూహ్య స్పందన వచ్చింది. సుమారు 300 మంది నిరుద్యోగ యువత ఇంటర్వ్యూలకు హాజరుకాగా 40 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్ తెలిపారు. ఈ ఇంటర్వ్యూలలో వరుణ్ మోటార్స్, వైసిస్‌క్లౌడ్ టెక్నాలజీస్, ముత్తూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసీ, 3జీఆర్ సర్వీసెస్, 2050 హెల్త్‌కేర్ సర్వీసెస్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ తరఫున రమేష్, నరేష్, కళాశాల ప్రిన్సిపల్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి రెయిన్ కోట్లు అందజేస్తున్న అధికారులు

నడిపల్లి సచివాలయ సిబ్బందికి రెయిన్ కోట్ల అందజేత

డిచ్‌పల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నడిపల్లి మేజర్ పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, గ్రామ కార్యదర్శి రాధికలు బుధవారం రెయిన్ కోర్టులను అందజేశారు. వర్షాకాలం దృష్ట్యా పనిచేసే వర్కర్లకు వర్షంలో తడవకుండా ఉండేందుకు వీటిని పంపిణీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి రాధిక తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రజత్‌కుమార్, కారోబార్లు సంతోష్, రాము పాల్గొన్నారు.

నూతన నియామకం

ఇందల్వాయి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పరిషత్ కార్యాలయంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్ల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇందల్వాయికి చెందిన జగ్గరాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాములు అన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు రమేష్, రవి, శివ, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరికొండ, జులై 2 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ పాఠశాలలో వంట చేయడానికి ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రత్యేక అధికారి షేక్ పర్వీన్ ఒక ప్రకటనలో కోరారు. పాఠశాలలో ప్రధాన వంట మనిషి పోస్టు కోసం దరఖాస్తు చేసుకునే వారు కనీసం పదోతరగతి ఉత్తీర్ణులైన ఉండాలని తెలిపారు. ఈ నెల 5 తేదీలోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

'పోడు రైతులను అడ్డుకుంటున్నారు'

సిరికొండ జులై 2 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం పోడు పట్టాలు ఇచ్చిన గిరిజన రైతులను సాగు చేసుకోకుండా అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని నిజామాబాద్ బంజార సంఘ నాయకులు బుధవారం వ్యవసాయ కమిషన్ అధ్యక్షుడు కోదండరెడ్డికి విన్నవించారు. ఏబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సబావట్ రాములునాయక్ ఆధ్వర్యంలో నిజామాబాద్ అధ్యక్షుడు రాములు నాయక్, పీర్‌సింగ్ నాయక్‌తో కలిసి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన బంజారా సంఘం నాయకులు అటవీ శాఖ అధికారులపై ఫిర్యాదు చేశారు.

జగన్నాథ రథయాత్రను విజయవంతం చేయండి

నిజామాబాద్ కల్చరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన జగన్నాథ రథయాత్రను విజయవంతం చేయాలని ఇస్కాన్ కంఠేశ్వర్ శాఖ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. జగన్నాథ రథయాత్ర శుక్రవారం మధ్యాహ్నం 1గంటకు కంఠేశ్వర్ నుండి బయలుదేరుతుందని ప్రతినిధులు తెలిపారు. రథోత్సవంలో భాగంగా ఉదయం జగన్నాథుడు, బలబద్రుడు, సుభద్రలకు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. భజనలు, సంకీర్తనలు, మేళతాళాలతో జగన్నాథుని రథయాత్ర కంఠేశ్వర్, రైల్వే కమాన్, ఎన్టీఆర్ చౌరస్తా, రైల్వేస్టేషన్, తిలక్‌గార్డెన్, బస్టాండ్, ప్రభుత్వ మెడికల్ కళాశాల, గాంధీచౌక్, నెహ్రూపార్క్, పెద్దబజార్, శివాజీనగర్ చౌరస్తా, పూలాంగ్ చౌరస్తా మీదుగా వినాయక్‌నగర్‌లోని విజయలక్ష్మి గార్డెన్ వరకు కొనసాగుతుందని అన్నారు. నగర పురవీధులగుండా సాగే రథోత్సవంలో భక్తులతో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు ఉంటాయని అన్నారు. విజయలక్ష్మి గార్డెన్‌లో జగన్నాథుడు, బలబద్రుడు, సుభద్రలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో రథయాత్రలో పాల్గొనాలని కోరారు.

నూతన డీవైఎస్‌వోగా పవన్‌కుమార్

సుభాష్‌నగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నూతన జిల్లా యువజన క్రీడల శాఖ అధికారిగా పవన్‌కుమార్ బుధవారం నగరంలోని డీవైఎస్‌వో కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి క్రీడల శాఖ అధికారిగా నియమించి నందుకు కలెక్టర్‌కు, ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పవన్‌కుమార్‌ను క్రీడాసంఘాలు, వ్యాయామ ఉపాధ్యాయులు సన్మానించారు.

ఇంటిగ్రేటెడ్ కోర్సు పరీక్ష ఫీజు తేదీ ప్రకటన

డిచ్‌పల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో పీజీ 2, 4 సెమిస్టర్ రెగ్యులర్ ప్రాక్టికల్, థియరీ పరీక్షలతో పాటు ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంఎస్ డబ్ల్యూ, ఎంకామ్, ఎంబీఏ, ఎంసీఏ, 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సు ఏపీఏ, ఏపీఈ, ఐఎంబీఏ పరీక్ష ఫీజు గడువు ఈనెల 15 వరకు ఎలాంటి రుసుము లేకుండా తీసుకుంటామని, రూ.100 అపరాధ రుసుముతో ఈనెల 18 వరకు చెల్లించ వచ్చని సీవోఈ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పేదల తలరాతలను మార్చేది అక్షరమే

(ఐదో పేజీ తరువాయి)

నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచితే కళాశాలలో మరిన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం కళాశాలకు మంజూరైన 30లక్షలతో తరగతి గదుల మరమ్మతులు, విద్యార్థులు, లెక్చరర్లకు టాయిలెట్స్ నిర్మించాలని సూచించారు. అదనపు గదుల కోసం మరో 30లక్షల రూపాయలు త్వరలోనే మంజూరు చేస్తానన్నారు. ఇప్పటికైన కళాశాలలో మార్పు రావాలని లేనిపక్షంలో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ప్రిన్సిపాల్‌తో సహా లెక్చరర్లను హెచ్చరించారు. అనంతరం కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి రవి కుమార్, ఏఎంసీ చైర్మన్ హన్మంతు, ఎంపీడీవోలు చందర్, శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ గంగాధర్, విండో అధ్యక్షులు కూచి సిద్దు, మాజీ జడ్పీటీసీ శంకర్ పటేల్, నాయకులు కొట్టం మనోహర్, బర్ల మధు, బర్ల సాయిలు, ఏజాజ్ ఖాన్, పత్తి లక్ష్మణ్, జుబేర్, ఎంఈవోలు శ్రీనివాస్ రావు, లోల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

(ఐదో పేజీ తరువాయి)

అప్రమత్తం చేసేలా సైన్ బోర్డులు, లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రత చర్యలు విధిగా పాటించేలా నిబంధనల పట్ల స్పష్టమైన అవగాహన కల్పించేందుకు విస్తృత చర్యలు చేపట్టాలన్నారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ పట్టణాల్లో ముఖ్య కూడళ్లు, ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రమాదాలు జరుగకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రోడ్లను ఆక్రమించుకొని బోర్డులు వంటి వాటిని ఏర్పాటు చేసిన దుకాణ యజమానులకు నోటీసులు జారీ చేసి వాటిని తొలగించాలని రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేయకుండా చూడాలన్నారు. ప్రధాన రహదారులపై ధాన్యం, మొక్కజొన్న వంటి వ్యవసాయ పంటలను ఆరబెట్టడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నందున రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో పురోగతి సాధించాలి

(ఐదో పేజీ తరువాయి)

నిర్మాణాలలో స్పష్టమైన ప్రగతి కనిపించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న వనమహోత్సవం కార్యక్రమం విజయవంతం అయ్యేలా ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. నర్సరీలో మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉంచాలని వాటిని నాటి కాపాడేలా అనువైన ప్రాంతాలను గుర్తించాలన్నారు. గతంలో నాటిన మొక్కలు చనిపోతే వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటాలని గృహాల కోసం పూలు, పండ్ల మొక్కలు పంపిణీ చేయాలన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. దోమల వ్యాప్తి నిరోధించేందుకు మురికి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. వచ్చే శుక్రవారం అన్ని ప్రాంతాలలో డ్రైడే పాటించాలని ఎక్కడైన మలేరియా, విష జ్వరాలు లాంటి కేసులు నమోదైతే దోమల నివారణ మందులు పిచికారీ చేయించి స్థానికుల రక్త నమునాలను సేకరించాలన్నారు. ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం రుసుము చెల్లించిన వారికి త్వరిత గతిన అనుమతి మంజూరు చేయాలన్నారు. రెండు పడక గదుల ఇళ్లను ప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా కేటాయించేలా అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని సూచించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పోర్టల్‌లో లబ్ధిదారుల వివరాలు నమోదు చేయాలన్నారు. అనంతరం పట్టణంలోని 11, 12వ వార్డులలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరైన లబ్ధిదారులను వారి నివాసాల వద్దకు వెళ్లారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. ఇంటి నిర్మాణాలకు ఇబ్బందులు ఉంటే మెప్మా ద్వారా రుణం ఇప్పిస్తామని, ఉచితంగా ఇసుక సరఫరా చేయించి నిర్మాణ దశలను బట్టి ఐదులక్షల రూపాయల ఆర్థిక సాయం అందజేస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమలో జిల్లా మలేరియా నియంత్రణ విభాగం అధికారి తుకారం రాథోడ్, మున్సిపల్ కమిషనర్ రాజు, తహసీల్దార్ సత్యనారాయణ, ఏడీఏ విజయలక్ష్మీ, ఎంపీడీవో బ్రహ్మానందం, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

జోరు వానల జాడేదీ?

(ఐదో పేజీ తరువాయి)

నీళ్లు చేరలేదు. ఇప్పటి వరకు చెరువులు నిండి అలుగులు పారలేదు. జిల్లాలో చెరువుల తాజా పరిస్థితిని పరిశీలిస్తే 654 చెరువుల్లో ఇప్పటికీ నామమాత్రంగానే నీళ్లు చేరాయి. ఈ చెరువుల్లో 25 శాతం లోపే నీళ్లు వచ్చాయి. జిల్లాలో 267 చెరువుల్లో 50 శాతంలోపు నీళ్లు చేరగా 137 చెరువుల్లో 75 శాతంలోపు నీళ్లు వచ్చాయి. 25 చెరువుల్లో 75 శాతం కంటే ఎక్కువగా నీళ్లు చేరాయి. జిల్లాలో 3 కుంటలు మాత్రమే నిండుదశకు చేరుకున్నాయి. జిల్లాలో నెలరోజులు దాటినా భారీ వర్షాలు పడకపోవడం వల్ల చెరువుల్లోకి వరద రాలేదు. నీటిమట్టాలు పెరగలేదు. రైతులు మాత్రం పడే వర్షాల ఆధారంగా పంటలను సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆరుతడి పంటలతో పాటు వరినాట్లు వేస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో ఇప్పటి వరకు 2లక్షల ఎకరాలకు పైగా పంటలు సాగు అయినట్లు అంచనా వేస్తున్నారు. వీటిలో లక్ష ఎకరాల వరకు వరిసాగు అయ్యింది. ఈ పంటలతో పాటు పసుపు, మొక్కజొన్న, సోయా పంటలు ఎక్కువగా రైతులు వేస్తున్నారు. జిల్లాలో పంటల సాగు పెరుగుతున్నా భారీ వర్షాలు పడకపోవడం వల్ల భూగర్భ జలాల ఆధారంగానే పంటలను రైతులు వేస్తున్నారు. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ ఈ మూడు నెలల్లో వర్షాలు పడే అవకాశం ఉండటంతో ఎక్కువ మొత్తంలో పంటలు వేస్తున్నారు. ప్రతీ సంవత్సరం జూన్ నెలలోనే చెరువుల్లోకి సగానికి పైగా వరద వచ్చి నిండిన ఈ సంవత్సరం మాత్రం నిండక పోవడం వల్ల రైతులు కొంతమేర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. చెరువుల కింద నారుమల్లు సిద్ధం చేసిన రైతులు మాత్రం బోర్ల కింద నాట్లను వేస్తున్నారు.

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.210	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో)	రూ.220	రూ.270	రూ. 290



బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.97,900	రూ.90,300	రూ.1085

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : కన్నప్ప (11.20, 3.00, 6.40, 10.20)
స్క్రీన్-2 : కుబేరా (11.40, 3.20, 7.00, 10.40)
స్క్రీన్-3 : ఎఫ్-1 ది మూవీ (తెలుగు) (10.05, 1.20)
: మార్గన్ (4.35)
: ఎఫ్-1 ది మూవీ (ఇంగ్లీష్) (7.25, 10.40)
స్క్రీన్-4 : సితారే జమీన్ పర్ (హిందీ) (10.10, 4.30, 10.50)
: మా (హిందీ) (1.35, 7.55)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కన్నప్ప (11.00, 3.40, 7.10, 10.35)
స్క్రీన్-2 : కుబేరా (1.20, 7.20, 10.30)
: మార్గన్ (4.30)
స్క్రీన్-3 : కుబేరా (10.30, 4.45)
: కన్నప్ప (1.35)
: మార్గన్ (7.50, 10.30)

దేవి : కన్నప్ప (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కుబేరా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : మా (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: మార్గన్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్